# పాతాళ లోకమును కదలించు ప్రార్థన

**- డేవిడ్ విల్కర్‌సన్**

దానియేలు గ్రంథము వ్రాయబడిన సమయములో ఇశ్రాయేలు బబులోను చెరలోనుండిరి. ఆరవ అధ్యాయముకు వచ్చే సమయానికి దానియేలుకు ఎనభై సంవత్సరముల వయస్సు. అప్పటికి దీర్ఘకాల పరిచర్య చేసినవాడై యుండెను. భక్తిగల ప్రవక్త మరియు ప్రసంగీకునిగా బబులోను రాజుల పరిపాలనకు సాక్షిగా నుండెను. మొదటి రాజు నెబుకద్నెజరు మరియు రెండవవాడు తన కుమారుడైన బెల్షస్సరు. ఇప్పుడు దానియేలు రాజైన దర్యావేషు యొద్ద పరిచర్య చేస్తుండెను.

అనేక సంవత్సరముల పరిచర్యయందు దానియేలు యెల్లప్పుడు ప్రార్థనాపరునిగానే యుండెను. ఇప్పుడు వృద్ధాప్యమందు తగ్గియుండాలనే తలంపులు తనకు ఎంతమాత్రమూ లేవు. దానియేలు నిరుత్సాహము చెందెననిగాని లేక నీరు గారిపోయి యుండెననిగాని తెలియజేయుట లేదు. ఎటువంటి బాధ్యతలూ లేకుండా రిటైరై ఏదో ఒక దూర ప్రాంతమందు ఏకాంత జీవితము జీవిస్తున్నట్లుగా కూడా లేఖనములు తెలియజేయుట లేదు. అయితే దానియేలు తన పరిచర్యలో ముఖ్య భాగముకు ఆరంభమును పలుకుచున్నాడు. ఎనభై సంవత్సరముల వయస్సు దాటిన వాడైయున్నప్పటికి తన ప్రార్థనలు పాతాళ లోకమును కంపింపజేసెను. అంతేగాక అపవాదిని కోపోగ్రహునిగా చేసెను.

అప్పటికి రాజైన దర్యావేషు దానియేలుకు ఒక ఉన్నత పదవిని అనుగ్రహించెను. ముగ్గురు రాష్ట్రపతులకు సమానమైన స్థాయిలో దానియేలు పరిపాలిస్తూ 120 ప్రాంతముల అధిపతులు మరియు గవర్నర్లపై ఆధిపత్యము కలిగియుండెను. మిగిలిన ఇద్దరు రాష్ట్రపతుల కంటె ఆధిక్యతను కలిగిన స్థితిలో దానియేలుండెనని పరిశుద్ధ గ్రంథము తెలియజేస్తుంది. రాజైన దర్యావేషు దానియేలును ఒక ముఖ్యమైన పనిలోపెట్టి ప్రభుత్వ నియమములను రూపొందించు బాధ్యతను అప్పగించెను. "ఈ దానియేలు అతి శ్రేష్ఠమైన బుద్ధిగలవాడై ప్రధానులలోను అధిపతులలోను ప్రఖ్యాతి నొందియుండెను గనుక రాజ్యమంతటిమీద అతని నియమింపవలెనని రాజుద్దేశించెను" (దానియేలు 6:3). దీనిని బట్టి చూస్తే దానియేలు చాలా పనిగల ప్రవక్తగా నుండెను. ఇన్ని భాద్యతలు నెరవేర్చవలసినవాడు ఎంతో "బిజీ"గా ఉండి ఉండాలి. పరిచర్య వత్తిడులు మరియు సమయాన్ని దోచుకునే ఇతర కార్యకలాపములు మరియు సమావేశములు ఎంతగా ఉండేవో నేను ఊహించుకొనలేను.

ఇన్ని పనిపాట్లు కలిగియున్నప్పటికి దానియేలు తన ప్రార్థనా సమయమునుండి తొలగిపోలేదు. ప్రార్థన తన జీవితములో ప్రధానమైన స్థానము ఆక్రమించుకొనెను. తన ఇతర పనుల కంటె ప్రార్థన ప్రాముఖ్యమైనదిగా నుండెను. ప్రార్థించే విషయములో దానియేలు ఎంతమాత్రము నిర్లక్ష్యపరుడు కాలేదు. రోజుకు మూడుసార్లు తన భాద్యతలు నాయకునిగా తనకున్న పనులను విడిచి ప్రభువుతో సమయము గడుపుటకు అతడు వచ్చెను.

తన పిలుపును నెరవేర్చుకొనుటకు కావలసిన తెలివి తేటల కొరకు, ఇతర గొప్ప నాయకుల యొద్ద దానియేలు సలహాలను పొందుకొనలేదు. తన క్రింద ఉన్న జన సమూహమునకు పరిచర్య చేయు నిమిత్తమై ఆయా సెమినార్లు లేక నాయకత్వ సదస్సులకు దానియేలు హాజరు కాలేదు. తన పనిపాట్లను విడిచి ప్రభువు సన్నిధిలో కేవలము ప్రార్థించుట ద్వారా దేవుని నుండి సలహాలను అతడు వినేవాడు. మోకాళ్ళని వర్తమానములను మరియు ప్రవచనములు, జ్ఞానము మరియు నడిపింపు దానియేలు పొందుకొనెను.

క్లిష్టకాలములలో ప్రార్థించు పరిచారకునిగా నుండుట ఎంత ప్రాముఖ్యమైనదో తెలిసికొనుటకు దానియేలు మనకు మంచి మాదిరియని నేను నమ్ముచున్నాను. నెబుకద్నెజరు పరిపాలనలో దీని ప్రాముఖ్యతను మనము చూడగలము. ఒకానొక సమయమందు రాజుకు సంచలనాత్మకమైన ఒక స్వప్నమొచ్చెను. దానిని బట్టి అతడు భయభ్రాంతుడై బహు చింతకు గురియయ్యెను. తనయొద్ద నున్న జ్ఞానులను పిలిపించి దాని భావమును చెప్పమని అతడు బ్రతిమాలుకొనెను.

వారెవ్వరూ కూడా దాని భావమును చెప్పలేకయుండుట చేత నెబుకద్నెజరు కోపోగ్రహుడయ్యెను. అప్పుడతడు సభలో ఇలా ప్రకటించెను, "మీరు కేవలము మాకు వట్టిమాటలు బుద్ధిహీనమైన మాటలు చెప్పుచున్నారు కాని నా హృదయమును తృప్తిపరచగలుగు సత్యముతో కూడిన మాటలే నాకు కావాలి." చివరికి తన సభయందున్న జ్ఞానులందరు చంపబడాలని ఆజ్ఞ జారీచేసెను. వీరిలో జ్యోతిష్యులు, మాంత్రికులు మరియు దానియేలుతో సహా కూడిన ముగ్గురు సోదరులైన జ్ఞానులు ఉండిరి.

జారీచేయబడిన మరణశిక్షను గూర్చి దానియేలు విన్నప్పుడు తన ముగ్గురు స్నేహితులను దగ్గరకు చేర్చుకొని కేవలము సలహాలు తీసుకొని ఆలోచించుటకు బదులు నలుగురూ కలిసి ప్రభువు సన్నిధిలో ప్రార్థింపనారంభించిరి. వారలా ప్రార్థించగా కనికరము మరియు ప్రత్యక్షత కొరకు వేడుకొనిరి.

దానియేలు చేసిన అఖండమైన ప్రార్థనను మనమిప్పుడు చూద్దాము: "ఎట్లనగా దేవుడు జ్ఞానబలములు కలవాడు, యుగములన్నిటను దేవుని నామము స్తుతినొందును గాక. ఆయన కాలములను సమయములను మార్చువాడై యుండి, రాజులను త్రోసివేయుచు నియమించుచు ఉన్నవాడును, వివేకులకు వివేకమును జ్ఞానులకు జ్ఞానమును అనుగ్రహించువాడునై యున్నాడు, ఆయన మరుగు మాటలను మర్మములను బయలుపరచును, అంధకారములోని సంగతులు ఆయనకు తెలియును; వెలుగు యొక్క నివాస స్థలము ఆయన యొద్ద నున్నది" (దానియేలు 2:20-22).

ఈ సమయమందు పాత నిబంధన సంఘము చాలా హీనదశలో నుండెను. దేవుని ప్రజలు తమ హృదయమందు గానమును కోల్పోయిరి, తమ స్తుతులు మౌనమయ్యెను. వారిప్పుడు ఆధ్యాత్మికముగా ఒరిగిపోవు స్థితిలో నుండిరి. బబులోనులో నున్న గొప్ప ఆర్థిక అభివృద్ధి అనేకుల హృదయాలను బంధీలనుగా చేసెను. ఇశ్రాయేలు పరిస్థితిని బట్టి సాతాను ఎంతో సంతోషించి యుంటాడనేది నా భావన. పరిస్థితులను మరింత విషమింపజేయుటకై నెబుకద్నెజరును ప్రేరేపించి దానియేలుకు మరణశిక్ష విధింపబడులాగున అపవాది చేసెను.

ఆ సమయమందు చెరలోనున్న ప్రతి ఇశ్రాయేలీయుడు దానియేలు వైపుకే చూస్తుండెను. అతడు దేవుని తాకుట మీద, వారి భవిష్యత్తు ఆధారపడి యుండెను. ఎవరితోనైనా దేవుడు ఇలా మాట్లాడునా అని వారు తలంచుచుండిరి. కాలములను గూర్చి జ్ఞానముగల వారెవరైనా ఉన్నారా? ప్రభువు యొక్క రహస్యము లెరిగిన వారెవరున్నారు? జరుగుచున్నదేమిటో తేటగా దానియేలు గ్రహించగలిగి యుండెను. పలు విధములుగా అతడు ప్రతిస్పందించ వచ్చును. యూదుల కొరకు న్యాయము చేకూర్చమని రాజధాని పట్టణము ఎదుట ధర్నాచేసి యుండవచ్చును. కాని పాతాళము, జన సమూహములు, ధర్నాలు మరియు మనుష్యుల చేత స్పందింపవు. మహా గొప్ప సంఘములు లేక భవనములు మరియు వారియందున్న సభ్యుల చేతకూడా పాతాళము స్పందింపదు. విద్యావంతులు మరియు గొప్ప జ్ఞానవంతుల వలన కూడా పాతాళము స్పందింపదు.

పాపమును ఎత్తి చూపించి హృదయ రహస్యములను బయటపెట్టు వాక్యమే ఈ లోకమును ప్రభావితము చేస్తుంది. సంశయించు హృదయాక్రంధనకు త్వరితమైన సమాధానమునివ్వగలుగు పరిశుద్ధాత్మ సత్యముద్వారా పలికిన స్వచ్ఛమైన మాటలు లోకము వినవాశిస్తున్నది.

ఆధునిక మానవాళి యొక్క చిత్రము రాజైన నెబుకద్నెజరులో మనము చూడగలము. తన ఆక్రంధన ఇలా ఉన్నది, "శక్తి ప్రభావములు నేను కలిగియున్నాను. నేను ఆశించిన సర్వసంపదలు నాకున్నవి. అయినను నాకు సమాధానము లేదు. నాకు అనేక ప్రశ్నలున్నవి మరియు వాటికి సమాధానములు కావాలి. దేవునితో మాట్లాడుచున్నామని చెప్పుకొనువారలారా - జ్ఞానులారా, మతస్తులారా, అంగీలు వేసుకున్న భక్తులారా - నా హృదయాక్రందనకు సమాధానము మీరు చెప్పలేని యెడల బ్రతుకుటకు మీరు అనర్హులు. మీ వలన ప్రయోజనము లేదు. సమాజముకు మీరుండుట వలన ఉపయోగము అంతకంటే లేదు."

ఈ మధ్య కాలములో డాలస్‌లో నేనుండగా సామాజిక సంఘము అనబడిన సహవాసమును నేను దర్శించాను. అక్కడ దైవారాధన బహు చులకనైన రీతిలో జరుగుచుండెను. వారి మధ్య ఎంతమాత్రమూ గౌరవభావము లేకుండెను. ఆరాధనా సమయములో చిల్లరి తిళ్లు తింటూ చల్లని పానీయములను సేవిస్తూ పిల్లల్ని అదుపులో పెట్టుకొనకు విచ్చలవిడిగా మనుష్యులు ప్రవర్తించుచుండిరి.

వీరి కూటము ఒక హాస్యాస్పదమైన నాటికతో నారంభమయ్యెను. ఆ తదుపరి లోక సంబంధమైన కొన్ని పాటలు పాడారు. చివరిగా డాక్టరేట్ పట్టా పొందిన సంఘకాపరి, చేతిలో చిన్న కాగితమును పుచ్చుకొని ముందుకు వచ్చి ప్రసంగము చేసెను. మీ ఉద్యోగ స్థలములలో మీరు సంతోషముగా నుండుట ఎలా? అనే అంశముపై అతడు పదినిమిషములు మాట్లాడెను.

సంఘములో మనుష్యులకు ఏమికావాలో తెలుసుకొని ఆ ప్రకారమైన సంఘారాధన గల పరిచర్యగా ఈ సంఘము ప్రారంభమయ్యెను. తత్ఫలితముగా ఎవ్వరికీ నొప్పి కలుగని రీతిలో ఈ ఆరాధన క్రమము రూపొందించబడెను. కాని లోతైన సమస్యలు కలిగి సమాధానముల కొరకు ఎదురుచూస్తున్న స్త్రీ పురుషులతో ఈ సంఘము నిండుకొని యుండెను. యవ్వనస్థులు జీవము లేనివారుగా నుండిరి. వీరినిబట్టి నా హృదయమెంతో బాధపడెను. అక్కడున్న ప్రతిఒక్కరూ పరలోకమునుండి వాక్యమును వినవలసినవారై యుండెను. కాని వారికి కేవలము గడ్డిపూచలే దొరుకుచుండెను. దేవుని తాకిడిని అనుభవించని స్థితిలో సంఘసేవకులు ఉండుట వలన పరిస్థితి ఇంత దిగజారి యుండెను.

## ఒక దేశమును గూర్చి గోడమీద దేవుని తీర్పు వ్రాయబడినప్పుడు ప్రార్థించు నాయకుల కొరకు ప్రజలు మొరపెడతారు.

దేవుని తీర్పు రానైయున్నదని అమెరికా దేశము గ్రహించిన దినమున, అంతా బాగానే ఉంది అని బోధించు ప్రసంగికుల నుండి ప్రజలు తొలగిపోతారు. అలా జరిగినప్పుడు మనుష్యులు ఇశ్రాయేలీయుల వలె దానియేలు వంటి భక్తి పరులవైపుకి తిరుగుతారు.

దానియేలు 5లో నెబుకద్నెజరు కుమారుడైన బెల్షస్సరు సింహాసన మందుండెను. ఈ అన్యుడైన రాజు తన వేయి ప్రభువుల కొరకై గొప్ప విందును ఏర్పాటుచేసెను. త్రాగిన మత్తులో అందరూ ఉండగా యెరూషలేము దేవాలయము నుండి తీసుకొని వచ్చిన బంగారము మరియు వెండి పాత్రలను రప్పించమని రాజు ఆజ్ఞాపించెను. ప్రతిష్ఠింపబడిన ఈ పాత్రలలో నుండి బెల్షస్సరు, ప్రభువులు, తన భార్యలు మరియు ఉపపత్నులు పిచ్చిగా త్రాగనారంభించిరి.

అకస్మాత్తుగా ఒక మనుష్యుని వ్రేళ్ళవలె అగుపడి గోడమీద ఒక వర్తమానము వ్రాయబడుచుండెను. తీర్పు, ద్వారము యొద్దే ఉన్నదని ఆ హెచ్చరిక తెలియజేసెను. రాజు ముఖ కాంతి మారెనని తన తలంపులు చెదిరెనని, తన మోకాళ్లు వణికెనని లేఖనములు తెలియజేస్తున్నవి. జ్యోతిష్యులు మరియు శాస్త్రజ్ఞులను రప్పించమని రాజు గట్టిగా మొరపెట్టెను.

"రాజు గారడీ విద్యగల వారిని కల్దీయులను జ్యోతిష్యులను పిలువనంపుడని ఆతురముగా ఆజ్ఞ ఇచ్చి, బబులోనులోని జ్ఞానులు రాగానే ఇట్లనెను - ఈ వ్రాతను చదివి దీని భావమును నాకు తెలియజెప్పువాడెవడో వాడు ఊదారంగు వస్త్రము కట్టుకొని తన మెడకు సువర్ణమయమైన కంఠభూషణము ధరింపబడిన వాడై రాజ్యములో మూడవ అధిపతిగా ఏలును. రాజు నియమించిన జ్ఞానులందరు అతని సముఖమునకు వచ్చిరిగాని ఆవ్రాత చదువుటయైనను దాని భావము తెలియజెప్పుటయైనను వారివల్ల కాకపోయెను" (దానియేలు 5:7-9). ఎంతటి భయ భ్రాంతులతో నిండుకొనిన సమయమందు మనమున్నాము. అయినను త్వరలో ఒక దినము రానైయున్నది. ఎంతో అభివృద్ధిని అనుభవించుచున్న అమెరికా దేశము ఇటువంటి అకస్మాత్తుగా తగలు దెబ్బకు గురి అవ్వనైయున్నది. దేవుని తీర్పు గోడమీద వ్రాయబడి యుండెను. నిస్సందేహముగా తీర్పు, ద్వారము యొద్దనే యున్నది. బెల్షస్సరు వలె మన దేశనాయకులు కూడా వేదన పొందుచున్నారు. వారి ముఖ కాంతి మారిపోవుచున్నది. వారి మోకాళ్లు వణుకు చున్నవి.

ఇది ఇలా ఉన్నప్పటికీ అమెరికాలో కొందరు సేవకులు ఒక తప్పుడు సమాధానమును భోదిస్తున్నారు. రాజీపడిన సంఘకాపరులు అనేకమంది దేవుడు అమెరికామీద తీర్పురానివ్వడు అని అంటున్నారు. మేమింతమంది మిషనరీలను ప్రపంచములోనికి పంపించుచున్నాము గనుక దేవుని దయకు మేము పాత్రులమవుతామని వారు వాదించారు. అయినను గర్భనిరోధకము ద్వారా నాలుగు కోట్లమంది శిశువులను చంపించినందుకు దేవుడు అమెరికాపై తీర్పు తీర్చనైయున్నాడని వారనుకొనరు. తీర్పు గోడమీద వ్రాయబడియున్నప్పుడు అట్టి సేవకులు మారు మాట్లాడరు. ఎందుకనగా ప్రార్థన ద్వారా రాబోవు సంగతులు దేవుడు వారికి చూపించును గనుక తగిన చర్య కొందరు తీసుకుంటారు.

ప్రార్థించని వ్యక్తివిగా నీవుంటే దేవుడే నీకు సహాయము చేయును గాక. దుష్టమైన ఈ కాలములయందు ప్రభువుతో నీవు ఎక్కువగా గడపవలసి యున్నావు. దేవుని తీర్పు గోడమీద ప్రత్యక్షమైనప్పుడు ఆ కాలమును గూర్చి మనుష్యులు నిన్నే అడుగుతారు. అప్పుడు వేదిక నుండి ఎన్ని హాస్యపు మాటలు పలికెదము? నీ ప్రసంగము మధ్యలో వారు జరగనై యున్నది ఏమది? తీర్పు అనగా నేమి? తదుపరి జరిగేదేమిటి? అని అడిగినప్పుడు నీవు ఎటువంటి సమాధానమివ్వగలవు? దయచేసి పాస్టర్‌గారూ! తదుపరి జరిగేది ఏమిటో మాకు చెప్పండి, తీర్పంటే ఇదేనా? రాబోయే దేమిటి? వీటిని గూర్చి మమ్మల్ని ముందుగా ఎందుకు హెచ్చరించలేదు? అంతా బాగానే ఉంది అన్నారుగా? మేమైతే సమస్తమూ నష్టపోయాము'' అని అడుగుతారు.

సంఘానికి హాజరు కావడానికి మనుష్యులకు ఏమికావాలి? అని సర్వే చేస్తున్నవాళ్లను చూస్తే నేను దిగ్భ్రాంతి చెందుతూ ఉంటాను. ప్రస్తుత కాలముల సంఘారాధనలు కొద్దికాలము బాగానే ఉండవచ్చుగాని దేవుడు తీర్పు ప్రత్యక్షమైనప్పుడు, మనుష్యుల బ్యాంకు ఖాతాలు క్షీణించినప్పుడు, తమ పిల్లలు మత్తు పదార్థములకు బానిసలైనప్పుడు, తమ కుటుంబములు విచ్ఛిన్నమైనప్పుడు, వీరి పరిస్థితులు చూడాలి. నీరుగారిన ప్రసంగములను వినుటకు గొఱ్ఱెలు సిద్ధముగా లేవు. వాటికి పవిత్రమైన నిష్కళంకమైన సత్యము కావాలి.

గరిశగాడు దివాణము పరిస్థితి పరిణామమును బట్టి వణకుచుండును. ఏమి జరిగిందో ఎవ్వరికీ తెలియకుండెను. అకస్మాత్తుగా త్రాగుడు ఆగిపోయెను. రాజు అలా వణుకుచుండగా ఒకడు ఇలా సెలవిచ్చెను, " నీ రాజ్యములో ఒక మనుష్యుడున్నాడు. అతడు పరిశుద్ధ దేవతల ఆత్మ గలవాడు; నీ తండ్రి కాలములో అతడు దైవజ్ఞానము వంటి జ్ఞానమును బుద్ధియు తెలివియు గలవాడై యుండుట నీ తండ్రి కనుగొనెను గనుక నీ తండ్రియైన రాజగు నెబుకద్నెజరు శకున గాండ్రకును గారడీవిద్యగల వారికిని కల్దీయులకును జ్యోతిష్యులకును పై అధిపతిగా అతని నియమించెను. ఈ దానియేలు శ్రేష్ఠమైన బుద్ధి గలవాడై కలలు తెలియజేయుటకును, మర్మములు బయలు పరచుటకును, కఠినమైన ప్రశ్నలకుత్తరమిచ్చుటకును జ్ఞానమును తెలివియు గలవాడుగా కనబడెను గనుక ఆ రాజు అతనికి బెల్తెషాజరు అను పేరు పెట్టెను'' (దానియేలు 5:11-12)

అంతట బెల్షస్సరు దానియేలును పిలిపించెను. అతడా ప్రవక్తతో ఇలా చెప్పెను, "నా యొద్దనున్న జ్ఞానులందరు దీని విషయమై భావమును చెప్పలేకయున్నారు గోడమీద వ్రాతను వివరించలేక యున్నారు అయితే కాలములను నీవు వివేచించగలవని నేనెరుగుదును గనుక దయచేసి సత్యమును తెలియజేసి నా అనుమానములను తొలగించుము'' (దానియేలు 5:16).

దానియేలు మాట్లాడగా తన మాటలు తేనెతో పూసినవిగా లేవు. అతడు మోకాళ్ళపై నుండి, ప్రజలు వినవలసిన విషయమేమిటో గ్రహించవలసిన వాడు. అంతట అతడిలా సెలవిచ్చెను, "బెల్షస్సరూ, అతని కుమారుడవగు నీవు ఈ సంగతియంతయు ఎరిగియుండియు, నీ మనస్సును అణుచుకొనక, పరలోకమందున్న ప్రభువుమీద నిన్ను నీవే హెచ్చించుకొంటివి, ఎట్లనగా నీవును నీ అధిపతులును, నీ రాణులును, నీ ఉపపత్నులును దేవుని ఆలయ సంబంధమగు ఉపకరణములలో ద్రాక్షారసము పోసి త్రాగవలెనని వాటిని తెచ్చియుంచుకొని వాటితో త్రాగుచు, చూడనైనను, విననైనను, గ్రహింపనైనను చేతకాని వెండి బంగారు ఇత్తడి ఇనుము కఱ్ఱ రాయి అనువాటితో చేయబడిన దేవతలను స్తుతించిరిగాని, నీ ప్రాణమును నీ సకల మార్గములును, ఏ దేవుని వశమున ఉన్నవో ఆయనను నీవు

ఘనపరచలేదు.... టేకేల్ అనగా ఆయన నిన్ను త్రాసులో తూచగా నీవు తక్కువగా కనబడితివి, ఫెరేస్ అనగా నీ రాజ్యము నీయొద్దనుండి విభాగింపబడి మాదీయులకును పారసీకులకును ఇయ్యబడును" (దానియేలు 5:22-23, 26-27).

బెల్షస్సరు మరియు తన ప్రభువులు వినవలసిన నిష్కళంకమైన సత్యము ఇటువంటిది. వారు గ్రహించులాగున వారి సంశయములు తీర్చబడులాగున సత్యమును దానియేలు పలికెను. అంతట బెల్షస్సరు ఎంతో కృతజ్ఞుడై దానియేలును తన రాజ్యములో ఉన్నత పాలకునిగా నియమించెను.

కాబట్టి మారుమనస్సు లేనివారికి సూటియైన ప్రసంగములు ఇష్టము లేదని నాతో చెప్పకండి. మారుమనస్సు లేనివారికి ఖచ్చితమైన మాటలు నచ్చవని నాతో చెప్పకండి. అది ఎంత మాత్రమూ నిజము కాదు.

## ప్రార్థించే ప్రతీ వ్యక్తి ప్రమాదములను ఎదుర్కొంటాడు

ప్రతీ ప్రార్థించే వ్యక్తి పాతాళలోకమునకు కొరడావంటి వాడై యుంటాడు. గనుక ఆ వ్యక్తి ప్రార్థనలను చల్లార్చుటకు అపవాది ఏమైనా చేయుటకు ప్రత్నిస్తాడు. నెబుకద్నెజరు మరియు బెల్షస్సరు పరిపాలన క్రింద దానియేలు యొక&క ప్రార్థనాశక్తిని ఋజువు చేస్తున్నాడు. ఇప్పుడు అతడు దర్యావేషు పరిపాలన క్రింద ఉన్నాడు. అంతట అపవాది దానియేలు ప్రార్థనలను ఆటంకపరచుటకు ఒక గూడుపుఠాణి పన్నెను. ప్రవక్త ప్రార్థన పాతాళలోకమును కంపింపజేయుట ద్వారా ద్వేషింపబడిన అపవాది బబులోను సామ్రాజ్యము నంతటినీ కూడ గట్టుకొని తనకు వ్యతిరేకముగా నిలవాలని నిర్ణయించుకొనెను.

గమనించండి! దానియేలు ఆ దేశమందున్న నాయకులందరిపై అధికారిగా నుండెను. ఆ రాజకీయ నాయకులు దానియేలులో జ్ఞానమును చూచి తనకున్న గౌరవము, ఘనతను బట్టి అసూయపడిరి. అంతట వారందరూ తనకు వ్యతిరేకముగా ఒక గూడుపుఠాణి పన్నిరి : "అందుకా ప్రధానులును అధిపతులును రాజ్య పాలన విషయములో దానియేలు మీద ఏదైనా ఒక నింద మోపవలెనని యుండి తగిన హేతువు కనిపెట్టు చుండిరి గాని దానియేలు నమ్మకస్థుడ యే నేరమైనను ఏ తప్పయినను చేయువాడుకాడు గనుక దానియేలులో తప్పయినను లోపమైనను కనుగొన లేకపోయిరి" (దానియేలు 6:4).

దానియేలు నిందారహితునిగా నుండెను. అంతట బబులోను నాయకులు తనలో ఒక్క తప్పునైనా ఎత్తిపట్టుకొనలేక పోయిరి. చివరికి హేతువేమీ లేక తన నడతయే లోపమని చూపుటకు వారు నిర్ణయించుకొనిరి. వారిలా అనుకున్నారు, "స్వరమండలముతో కలిసి పిచ్చిపాటలు పాడుచు దావీదు వలెనే వాయించు వాద్యములను కల్పించుకొందురు" (దానియేలు 6:5). నేడు మన విషయమై ఇలా జరుగునా?

యెరూషలేము వైపుకి తిరిగి రోజుకు ముమ్మారు దానియేలు ప్రార్థించెనని నాయకులు ఎరిగియుండిరి, ఈ ప్రార్థనల వలెనే తన కింతటి గుర్తింపు కలుగుచున్నదని కూడా వారు నమ్మిరి. అందుచేత అతడలా ప్రార్థన చేయకుండా ఉండుటకు చేయవలసిన ఉపాయములు ఆలోచించిరి. ఇదెలా? దానియేలు సమయాన్ని పనిపాట్లతో నింపితే ఇది సాధ్యపడుతుందని వారనుకున్నారు. ఏదో ఒక ప్రాముఖ్యమైన పనిలో తనని నిమఘ్నము చేసి అలా చేయుట ద్వారా ప్రార్థన నుండి తనను దూరపరచాలని వారు ఆశించిరి.

ప్రియులారా! విశ్వాసము విషయమై అపవాది ఉపయోగించు తంత్రములలో ఇది బహు ప్రాముఖ్యమైనది. మరి ముఖ్యముగా సేవకుల విషయమై అపవాది చేయు గూడుపుఠాణీ ఇది. ఒక కాపరి ఎందుకు ఎక్కువ ప్రార్థనలో గడుపడు అని అడిగితే సమయము లేదని బహుసా సమాధానమిస్తాడు. ఒక సంఘ కాపరి పాత్ర బహు సమయమును వ్యయం చేసేదిగా ఉంటుంది. మిగిలిన సమయము కేవలము ప్రసంగమును సిద్ధపరచుకొనుటకే సరిపోతుంది.

అనేకమంది క్రైస్తవులు కూడా ఇటువంటి శోధనలో పడిపోతూ ఉంటారు. ప్రార్థించుటకు సమయము లేదని వారంటారు. నాపని నా సమయము నంతటిని దోచుకొంటుంది అని ఆరోపిస్తారు. కొన్నిసార్లు గృహిణులు కూడా

ప్రార్థించుటకు సమయము లేదు మా సమయమంతా పిల్లలతోనే అయిపోతుంది అని అంటారు. వంట, ఇంటిపని, చేసుకొనగా ఒక సమయము మిగులుట లేదు అని కూడా అంటారు.

ప్రార్థించుటకు సమయము లేదు అని, పనిపాట్లలో చిక్కుకొన్నవారు భయంకరమైన రోగికంటే ఘోరమైన స్థితిలో నున్నారని నేను నమ్ముచున్నాను. ఇది ఎందుకనగా తానున్న పరిస్థితిలో తాను అడుగడుగునా తృప్తి చెందుచు ఉంటున్నాడు. ఇలా జరుగుట ద్వారా క్రమేపీ ప్రార్థన లోపము తనలో పెరిగి దేవుని గూర్చిన స్పృహను కోల్పోవుచున్నారు. ఇలా కొనసాగుచు దేవుని యొక్క ఉనికిని పూర్తిగా స్పర్శించలేనివానిగా మిగిలిపోతారు.

ప్రార్థన లేకుండా ఒక్క దినము కూడా మనలేమని దానియేలు ఎరిగెను. అందుచేత ప్రార్థనలో అతడు కొనసాగెను. తన తోడివారు తనపై ఎంతటి పని మోపినప్పటికి ప్రార్థనను మాత్రము నిర్లక్ష్యపెట్టలేదు. ముప్పది దినములు ప్రార్థన నిషేదింపబడవలెనను కథనము మీరెరుగుదురు, ఇది కేవలము దానియేలు నుద్దేశించి జారీ చేయబడన చట్టము. అయినప్పటికీ పాతాళమును కదిలించు ప్రార్థనలను దానియేలు ఆపనేలేదు. అంతట ఆ తీర్మానము తనను సింహపు బోనులోకి పడవేసెను.

అంత తీవ్రముగా ప్రార్థించుటకు దానియేలును ప్రేరేపించిన కారణములేవి? అని మీరు అనుకొనవచ్చును మరణ శిక్ష తనపై ఉందని తెలిసికూడా ప్రార్థన కొనసాగించుటకు హేతువేమిటి? ఎనభై సంవత్సరములు గల ఈ వృద్ధుడు అంత తీవ్రముగా ప్రార్థించవలసిన అవసరమేంటి? మిగిలిన సంఘమంతా ఇంతటి తీవ్రత గల వారిగా నుండక పోయినా దానియేలుకు ఈ పట్టుదల ఏమిటి?

ప్రార్థనలో కొనసాగుటకు దానియేలు తీసుకున్న శ్రమను గమనించండి. ఆ దినములలో న్యూయార్కు మహా పట్టణము వంటి బబులోనులో అతడు నివసించుచుండెను. సంతోషమును సుఖమును ఆశించే ప్రజల మధ్య అతడుండెను. ఇదిలా ఉండగా అన్ని కోణముల నుండి వివిధమైన పనిపాట్ల యందు నిమఘ్నుడై యుండెను.

గమనించండి ప్రార్థన అనేది సర్వసాధారణముగా కలిగేది కాదు. ప్రార్థనకు క్రమశిక్షణ అవసరము. దానిని కొనసాగించుటకు కూడా క్రమశిక్షణ అవసరము. మన శరీరము మరియు అపవాది మనకు వ్యతిరేకముగా పనిచేస్తూ ఉంటాయి. ఇలా ఉండగా మనము ప్రార్థనాపరులమై ఎలా ఉండగలము?

## తీర్పుకు లోనై ఆధ్యాత్మిక క్షీణతను అనుభవిస్తున్న కాలములో దేవుడు ఒక ప్రార్థనా పరుని కొరకు వెదకు చుండెను

యిర్మియా 5:1లో ఇలా ఉంది, ''యెరూషలేము వీధులలో అటుఇటు పరుగెత్తుచు చూచి తెలిసికొనుడి; దాని రాజవీధులలో విచారణ చేయుడి; న్యాయము జరిగించుచు నమ్మకముగా నుండ యత్నించుచున్న ఒకడు మీకు కనబడిన యెడల నేను దాని క్షమించుదును.'' నన్ను వెదకువాడు ఒక్కడున్నప్పటికి నేను మీ అందరిమీద కనికరము కలిగి యుందునని ప్రభువు సెలవిస్తున్నాడు.

దేవుడు తన ప్రజలను పూర్ణ ఆశీర్వాదములతో నింపి వారిని సంరక్షించుచుండెను. అయినను నైతిక విలువలను ప్రక్కకునెట్టి, వ్యభిచారములోపడి వేశ్యల వెంటపడి వారు తిరుగుచుందురు. అంతేగాక పాపము విషయమై వారిక దుఃఖించుట లేదు. మరియు దిద్దుబాటును తిరస్కరిస్తుండిరి. అంతట విరిగి నలిగిన హృదయము గల ఒక్క ప్రార్థనాపరుని కొరకు దేవుడు వెదకుచుండెను. విజ్ఞాపన చేయగలుగు ఒక్కనరుని గూర్చి ఆయన చూడగా ఒక్కడును దొరకలేదు.

ఇటువంటి విషాధ పరిస్థితి యెహేజ్కేలు 23లో కూడా చూడగలము. ఇశ్రాయేలీయుల ప్రవక్తలు మరియు యాజకులు తోడేళ్లవలె తయారైరి అమాయక ప్రజల మీదపడి వారు బ్రతుకుచుండిరి. దేవుని పరిశుద్ధతను అపవిత్రపరుస్తూ మంచికీ చెడుకీ విచక్షణ తెలియని రీతిలో వారుండిరి. పాపము పట్ల దృష్టి పెట్టక అబద్దములను బోధిస్తూ ఇదే యెహోవా వాక్కని తప్పుడు ప్రార్థనలు వారు చేసిరి. వీరిని వ్యతిరేకించుటకు ఒక్క మనుష్యుని కొరకు

దేవుడు వెదికెను? నేను దేశమును పాడుచేయకుండునట్లు ప్రాకారమును దిట్టపరచుటకును, బద్ధలైన సందులలో నిలుచుటకును తగినవాడెవడని నేను ఎంత విచారించినను ఒక్కడైనను కనబడలేదు'' (యెహెజ్కేలు 22:30).

ఇప్పుడు బబులోను చెర కాలమందు దేవుడు దానియేలు అనబడిన ఒక్క మనుష్యుని కనుగొనెను. మరియు నేడు చరిత్రలో ఎప్పుడూ లేనంతటి రీతిలో ప్రభువు ఇటువంటి భక్తిపరులైన స్త్రీ పురుషుల కొరకు వెదకుచున్నాడు. బీటలలో నిలువబడి దేవుని ప్రజల చుట్టూ కంచెవేయగలిగిన రీతిలో ఉండు నమ్మకస్థులైన సేవకుల కొరకు ఆయన వెదకుచున్నాడు. ఇటువంటి పరిచర్యచేయుట కేవలము ప్రార్థన ద్వారానే సాధ్యము.

దానియేలుకువలె దేవుని వాక్యము గలవాడే ఇలా ఉండగలడు. పరిశుద్ధాత్ముడు దానియేలు యొద్దకు వచ్చినప్పుడు ప్రవక్త యిర్మీయా గ్రంథము నుండి కొన్ని మాటలు చదువచుండెను. ఆ సమయమందు దేవుని ఆత్మ ఇశ్రాయేలుకు కలుగబోవు విడుదలను గూర్చి మాట్లాడెను. ఆ ప్రత్యక్షత రాగా దానియేలు ప్రార్థనకు ప్రేరేపితుడయ్యెను. "అంతట నేను గోనెపట్టకట్టుకొని, ధూళి తలపైన వేసికొని ఉపవాసముండి, ప్రార్థన విజ్ఞాపనలు చేయుటకై ప్రభువగు దేవుని యెదుట నా మనస్సును నిబ్బరము చేసికొంటిని, నేను నా దేవుడైన యెహోవా యెదుట ప్రార్థనచేసి యొప్పుకొన్నదేమనగా ప్రభువా మహాత్మ్యము గలిగిన భీకరుడవగు దేవా, నీ ఆజ్ఞలను అనుసరించి నడుచు వారియెడల నీ నిబంధనను నీ కృపను జ్ఞాపకము చేయువాడా'' (దానియేలు 9:3-4).

ఆయన వాక్యమును శ్రద్ధగా వెదకు సంఘములు మరియు కాపరుల కొరకు దేవుని ఆత్మ వెదకుచున్నది. ఇట్టి సేవకులు కేవలము బైబిలు జ్ఞానము కొరకు చూడరు. వీరు ఆధ్యాత్మిక శక్తిని ఆశించేవారు. పాపాన్ని నిర్మూలించ ప్రయత్నించువారు. మరియు సత్యమే వారిని స్వతంత్ర పరుస్తుందని ఎరిగినవారు. దేశమందు ఏమి జరుగుతుందో తేటగా గ్రహించగలిగినవారై ఉంటారు. ఎందుకనగా దేవుని వాక్యము ద్వారా ఈ విషయములను వారు గుర్తెరుగుతారు. ప్రభువు ఇటువంటి మనుష్యులను కనుగొనినప్పుడు ప్రార్థనాత్మతో వీరిని దేవుడు దీవిస్తాడు.

## ప్రార్థించే దాసుడు సంఘస్థితిని చూస్తాడు

దేవుని ప్రజలను ఉజ్జీవింపజేయు సమయము వచ్చియున్నదని గ్రహించినప్పుడు దానియేలు ఎంతో ఉత్తేజపరుడయ్యెను. అయితే ఇశ్రాయేలు యొక్క ఆధ్యాత్మిక పరిస్థితిని చూచినప్పుడు ప్రవక్త ఎంతో దుఃఖించెను. బబులోను పాపములచేత నింపబడి ప్రజలుండిరి వీరు కేవలము సుఖభోగములు మరియు ధనధాన్యములను ఆశించిన వారుగా నుండిరి. నైతిక విలువలు పూర్తిగా నిర్లక్ష్యపెట్టినవారై యుండిరి.

దేవుని యొక్క పునఃరుద్దరణకు ఆయన ప్రజలు సిద్ధపడి యుండలేదని దానియేలు ఎరిగెను. అయినను తమ పాపముల విషయమై ప్రవక్త వారిని బహిరంగముగా ఖండించి ఎదుర్కొనెనా? తనచుట్టూ ఉన్న నైతిక పతనముతో దానియేలు తననుతాను సరిపోల్చుకొనెను. తానిలా ప్రకటిస్తున్నాడు, "మేమైతే నీ దాసులగు ప్రవక్తలు నీ నామమును బట్టి మారాజులకును మా యధిపతులకును మా పితరులకును యూదయ దేశజనులకందరికిని చెప్పిన మాటలను ఆలకింపక నీ ఆజ్ఞలను నీవిధులను అనుసరించుట మాని పాపులమును దుష్టులమునై చెడుతనమందు ప్రవర్తించుచు తిరుగుబాటు చేసిన వారము! ప్రభువా, నీకు విరోధముగా పాపము చేసినందున మాకును మా రాజులకును మాయధిపతులకును, మా పితరులకును, ముఖము చిన్నబోవునట్లుగా సిగ్గే తగ్గియున్నది'' (దానియేలు 9:5,8). ప్రభువైన యేసుక్రీస్తు సంఘము విషయములో కూడా ఇది నిజమై యున్నదని నేను నమ్ముచున్నాను. మనపైకి, మనకు రాబోవు గొప్ప ఉజ్జీవము కొరకు మనము సిద్ధముగా లేము. ఇశ్రాయేలీయులకువలె ప్రస్తుత కాలపు దుష్టసమాజమును బట్టి మలినము చేయబడి యున్నాము.

స్వల్పముగా చెప్పాలంటే ఆధునిక బబులోను కాలములో మనమున్నాము. విచారకరమైన సంగేతమనగా క్రైస్తవులు కూడా నేటి సమాజము యొక్క పాప విధానములను దత్తత చేసికొని యున్నారు. ముఖ్యముగా యవ్వనస్థులు సాతాను తంత్రములకు గురియైయున్నారు.

నేడు తన ప్రజలను దీవించాలని దేవుడు బలముగా కోరుకొనుచున్నాడు. కాని మన మనసులు ఈ లోక సంబంధమైనా ఆత్మచేత మలినమై యుండుట వలన ఆయన దీవెనలకు పొందుకొను స్థితిలో మనము లేము. అంతట దావీదు ఈ శక్తివంతమైన ప్రకటన చేయుచున్నాడు, "మోషే ధర్మశాస్త్రమందు వ్రాసిన కీడంతయు మాకు సంభవించినను మేము మా చెడునడవడి మానకపోతిమి; నీ సత్యమును అనుసరించి బుద్ధి తెచ్చుకొనునట్లు మా దేవుడైన యెహోవాను సమాధాన పరచుకొనకపోతిమి. మేము మా దేవుడైన యెహోవా మాట వినలేదు గనుక ఆయన తన సమస్త కార్యముల విషయమై న్యాయస్థుడై యుండి, సమయము కనిపెట్టి ఈ కీడు మా మీదికి రాజేసెను" (దానియేలు 9:13-14).

దానియేలు ఇలా అంటున్నాడు, మన దేశమందు నైతిక దుర్భరస్థితిని మనము చూసాము. మన కాపరులు తమ సొంత ప్రణాళికలు కలిగియుండుట మనము చూసాము. మన సమాజమంతా నాశనమునకు పరుగులు తీస్తుంది. అయినను మనమింకను ప్రార్థనవైపుకు తిరుగలేదు. మనము ప్రార్థించియున్న యెడల దేవుడు మన పాపముల నుండి మనల్ను తొలగించి యుండును. మహిమోన్నతమైన వాగ్దానములను మనకు దయచేయుటకు ఆయన కనిపెట్టుచున్నాడు. కాని మనమాయనకు సమయమివ్వలేదు. దానికి బదులు మనము ఆయన నుండి దూరముగా తొలగిపోయి యున్నాము. దుష్ట సమాజములో నున్న పాపముల చేత తృప్తిపొందినవారమై యున్నాము. కనుక ఈ తీర్పు మన మీదకి వచ్చియున్నవి."

పాతాళమును కదిలించు ప్రార్థన ఏమైయున్నదని మీరడగవచ్చును. నమ్మకమైన శ్రద్ధగల దాసులు మనదేశమును మరియు మన సంఘమును చూచి ప్రభువు సన్నిధిలో మోకరించి, ప్రభువా దీనిలో నేను పాలికలిగి యుండగోరుట లేదు. ఈ దుష్ట జనాంగము మధ్య నువ్వు కాపాడుశక్తికి నేను మాదిరిగా నుండ నిష్టపడుచున్నాను. వేరెవ్వరూ ప్రార్థించక పోయిననూ నేనైతే ప్రార్థన చేయ నిష్టపడుచున్నాను."

దానియేలు ముగిస్తూ ఇలా అంటున్నాడు, "నేను ఈలాగున మాటలాడుచు ప్రార్థన చేయుచు నుండగా, మొదట నేను దర్శనమందు చూచిన అతి ప్రకాశమునుడైన గాబ్రియేలను ఆ మనుష్యుడు సాయంత్రపు బలి అర్పించు సమయమున నాకు కనబడి నన్నుముట్టెను. అతడు నాతో మాటలాడి ఆ సంగతి నాకు తెలియజేసి ఇట్లనెను - దానియేలు, నీకు గ్రహింపశక్తినిచ్చుటకు నేను వచ్చితిని నీవు బహు ప్రియుడవు గనుక నీవు విజ్ఞాపనము చేయ నారంభించినప్పుడు ఈ సంగతిని నీకు చెప్పుటకు వెళ్లవలెనని ఆజ్ఞ బయలుదేరెను, కావున ఈ సంగతిని తెలిసికొని నీకు కలిగిన దర్శన భావమును గ్రహించుము" (దానియేలు 9:21-23).

దేవుని గృహమందు నేడు ప్రార్థించు ప్రజలు ఎక్కడున్నారు? ప్రభువు సన్నిధిలో వెదకు నమ్మకమైన కాపరులు ఎక్కడున్నారు? వారు మిక్కిలి ప్రేమింపబడినవారు గనుక వారికి జ్ఞానవివేకములు అనుగ్రహింపబడి యున్నవి.

దానియేలుకు వలె ఈ దాసులు దేశపాపములతో తమను తాము సరిపోల్చుకొనియున్నారు. అంతట వారు దీనమనస్కులై (ప్రభువా మేమెక్కడ తొలగి పోవుచున్నామో మేమే విధముగా మీకు దూరమగుచున్నామో వాటి విషయములో చర్య తీసికొనుటకు మాకు సహాయమ చేయండి, ఏది ఏమైనా ప్రార్థనయందు మోకాళ్ళయందు మే ఉండుటకు సహాయము చేయండి. ఈ సంఘము పునరుద్ధరించబడాలని నేను ఆశిస్తున్నాను".